క్లుప్తంగా

అనుమతులు పరిశీలించే.. ప్లాట్లు కొనండి

చిలకలూరిపేట: ప్లాట్లు కొనుగోలు చేసే వినియోగదారులు అవి లేఅవుట్ చేసిన వెంచర్లా, అనుమతులు ఉన్నాయా లేవా అని పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయాలని వినియోగదారుల హక్కుల రక్షణ ఫోరం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ తెలిపారు. సినిమా నటులు, టీవీ ఆర్టిస్టులు, ఇతర ప్రముఖులు ప్రకటనల్లో కనిపించినంత మాత్రాన వాటికి అన్ని అనుమతులు ఉన్నట్లు భావించరాదన్నారు. ప్రకటనలు నమ్మి మోసపోకుండా సంబంధిత వెంచర్‌కు సంబంధించిన అనుమతులు పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.

ఆర్టీసీకి రూ. 15 లక్షల ఆదాయం

వినుకొండ: తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ పై బస్సులు నడిపినందుకు ఆర్టీసీకి సుమారు రూ. 15 లక్షల మేర ఆదాయం వచ్చినట్లు వినుకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి 21 బస్సు సర్వీసులు ఏర్పాటు చేయగా, రూ. 7.19 లక్షలు ఆదాయం రాగా, ఇతర డిపోల నుంచి మరో 20 బస్సులకు గాను రూ. 15 లక్షలు వరకు ఆదాయం వచ్చిందని తెలిపారు. సుమారు 20 వేల మంది భక్తులను ఆర్టీసీ దైవ దర్శనానికి తరలించినట్లు వెల్లడించారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నాదెండ్ల: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో రాణించాలని హెచ్‌ఎం వై.రాజ్యలక్ష్మి చెప్పారు. కనపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శ్రీ నరసరావుపేట సాయిక్షేత్రంకు చెందిన దాతలు దివ్యాంగ విద్యార్థి వల్లెపు గోపికి ట్రైసైకిల్, 70 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులు అందించారు. దాత బలరామిరెడ్డి, అనురాధ దంపతులు రూ.12 వేలు విలువైన విద్యాసామగ్రిని సాయిక్షేత్ర నిర్వాహకులు గోపాలబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయిక్షేత్ర నిర్వాహకులు శ్రీనివాస్, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారం చేపట్టే వరకు శ్రమించాలి

రొంపిచర్ల: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేవరకు ప్రతి ఒక్కరూ శ్రమించాలని వైఎస్సార్ సీపీ మండల కమిటీ సభ్యులకు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అన్నె పున్నారెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన కమిటీలు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. అలాగే మంగళవారం అన్ని మండలల్లో, గ్రామాల్లో దివంగత నేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కేంద్ర బృందం పరిశీలన



నూజెండ్ల: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పథకం అమలు తీరుపై కేంద్ర పరిశీలన బృందం సోమవారం మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా మండలంలోని పుచ్చనూతల సచివాలయ పరిధిలోని వివిధ గ్రామాలు, అక్కడ ఉన్న పాఠశాలలు వాటిలో మౌలిక వసతులు పరిశీలించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు కె.భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, ఎస్ డబ్ల్యూ పీసీ షెడ్ల పనితీరు పరిశీలిస్తున్నామన్నారు. దీంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, హెల్త్ సెంటర్లలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. గ్రామాలలో మౌలిక వసతుల ఆధారంగా పంచాయతీలకు గ్రేడింగ్ ఇవ్వటం జరుగుతుందని ఆయన తెలిపారు. పర్యటనలో డీడబ్ల్యూఎస్ కన్సల్టెంట్ రమేష్, సర్పంచ్ మూడావత్ శ్రావణి నాగరాజు, ఇవోపీఆర్‌డీ రబ్బాని, కార్యదర్శి చిట్టిబాబు, కంచర్ల సుబ్బరామయ్య పాల్గొన్నారు.

వేల్పూరు వాసి నేత్రాదానం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామవాసి ఎస్‌కె.మస్తాన్ సాహెబ్ వృద్ధాప్యం కారణంగా (85) మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడు కుటుంబ సభ్యుల అనుమతితో రెండు నేత్రాలను శంకర కంటి వైద్యశాలకు దానం చేసినట్లు అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేత్రాదానం చేయటం వలన మరో ఇద్దరు అంధులకు కంటి చూపు వస్తుందన్నారు. సాధారణంగా చనిపోయిన వారందరు ఐస్ బాక్సులో ఉంచిన అనంతరం ఐదు గంటల సమయంలోపు నేత్రాలు దానం చేయవచ్చునన్నారు.

వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ కమిటీలు ఇవే



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని చిలకలూరిపేట మున్సిపాల్టీ, చిలకలూరిపేట మండలం, నాదెండ్ల, యడ్లపాడు మండల పార్టీ కమిటీలను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు...

చిలకలూరిపేట మున్సిపాల్టీ..
ఉపాధ్యక్షులుగా ఊస రమేష్, గోపతోటి జాన్, ప్రధాన కార్యదర్శులుగా బండారు జయకుమార్, దాసరి రామకృష్ణ, తియ్యగూర అంజిరెడ్డి, కోశాధికారిగా ఎర్రి రాఘవ, కార్యదర్శులుగా షేక్ బడేమియా, రాచపూడి వెంకట్, చల్లా శ్రీను, ఆముదాలపల్లి ఆంజనేయులు, కొండెబోయిన సారథి నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మల్లెల నాగలక్ష్మి, గట్టా రమేష్, సయ్యద్ అక్బర్, కె.కామేశ్వరరావు, టీపీ శ్రీనివాసరావు, షేక్ ఇర్ఫాన్‌బాష, దాచేపల్లి నాగేశ్వరరావు, కస్నా నాయక్, కొరివి రంగయ్య, డీలర్ రఫీ, కొన నారాయణ, దేవరకొండ జగన్నాథం, షేక్ మొహిద్దీన్, సుదర్శనం వెంకయ్య నియమితులయ్యారు.

చిలకలూరిపేట మండలం..
ఉపాధ్యక్షులుగా కొమ్మనబోయిన హరికృష్ణ, ముత్యాల రామారావు, ప్రధాన కార్యదర్శులుగా నర్రా సత్యనారాయణ, మొఘల్ జిలాని, మానుకొండ బుచ్చిబాబు, కిష్టారపు శేఖర్, కార్యదర్శులుగా కొమ్మనబోయిన యల్లమంద, కట్టా నాగేశ్వరరావు, దండా నాగేశ్వరరావు, గేరా మురుసలయ్య, సూరబోయిన మురళి నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నలమల మరియమ్మ, జిజ్జర రవి, కొమ్మనబోయిన కోటయ్య, బోడి సాంబయ్య, పల్లపు శ్రీను, కంభంపాటి సురవయ్య, వై.ఎస్ కరిముల్లా షేక్ జాన్‌సుభాని, యంపరాల సుభాని, తిమ్మిశెట్టి సాంబశివరావు, కొణిదెన సురేష్, దేవరపల్లి సూరారెడ్డి, గోరంట్ల సుబ్బయ్య, చెల్లు బ్రహ్మారావు, తిమ్మలూరి ఇజ్రాయేలు, షేక్ బాజి, బిరుదు లక్ష్మన్, బత్తుల రత్నరాజు, గోపతోటి రంజిత్ నియమితులయ్యారు.

నాదెండ్ల మండలం..
ఉపాధ్యక్షులుగా అల్లాడి రవికుమార్, బత్తుల సీతారామిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నల్లమోతు పట్టాభి, బంటుపల్లి ఏడుకొండలరావు, ఏరువ సుందరరెడ్డి, కార్యదర్శులుగా రెడ్డిమల్లి నాగిరెడ్డి, కొనస బ్రహ్మనాయుడు, గుమ్మడి మల్లికార్జునరావు, జంగాల రమేష్‌బాబు, పూదోక బాలరాజు, దావల రత్నకుమార్ నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ముక్కపాటి సంధ్యారాణి, నర్రా అంకమ్మరావు, పసుమర్తి మస్తాన్‌వలి, వజ్జా శ్రీనివాసరావు, జట్టి గంగయ్య, యడ్ల విజయబాబు, చట్టాల నాగరాజు, ఈవూరు అంజిరెడ్డి, కందుల బుచ్చయ్య, తప్పెట లూర్దురాజు, కాటం లక్ష్మయ్య, చెరుకూరి రాజు, జి.నాగేంద్రబాబు, ఎస్.బాలస్వామి, జ్ఞానయ్య నియమితులయ్యారు.

యడ్లపాడు మండలం..
ఉపాధ్యక్షులుగా పాలూరి శ్రీనివాసరెడ్డి, గుత్తి సింగయ్య, ప్రధాన కార్యదర్శులుగా జాజుల సాంబయ్య, షేక్ జకీర్ హుస్సేన్, గుర్రం సురేష్, కీర్తి అరుణ్‌కుమార్, కార్యదర్శులుగా గౌరీ రాజేష్, రాజేష్ యాదవ్, కాకర్లపూడి మాధవరావు, కర్రా చినకోటయ్య, షేక్ ఖాదర్‌బాష నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వంకడావత్ బాలమ్మబాయి, పల్లపు మంగయ్య, విప్పర్ల కోటయ్య, బింజు సాంబశివరావు, కొండెపోగు రామదాసు, షేక్ సుభాని, షేక్ అమ్మర్‌హంజ, గల్లా వెంకటరావు, కట్టా జయరావు, బెజ్జం వెంకయ్య, కొమెరగిరి రఘు, వెల్లటూరి శ్రీనివాసరావు, చుండి వేణు, పల్నాటి గురవయ్య నియమితులయ్యారు.

నేటి వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయండి

పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చిన జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ 76వ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం 9 గంటల నుంచి పట్టణంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తామన్నారు. తొలుత జిల్లా పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం బయలుదేరి రామిరెడ్డిపేట, చెరువు, మిట్టబజారు, బీసీకాలనీ, ఒకటో వార్డు, క్రిస్టియన్‌పాలెం, ప్రకాష్‌నగర్‌లలో విగ్రహాల వద్ద కార్యక్రమాల్లో పాల్గొంటామన్నారు. అలాగే సాయంత్రం వివిధ గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించటం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అందరూ పాల్గొనాలని కోరారు. ఉదయం 9 గంటలకు అందరూ జిల్లా పార్టీ కార్యాలయంకు చేరుకోవాలని కోరారు.

వినుకొండలో..
వినుకొండ: మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కార్యాలయం వర్గంవారు సోమవారం తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: కౌన్సిలర్లు, అధికారులు వార్డుల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించటంలో చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.90 కోట్లతో అత్యవసర పనులు పూర్తి చేయాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ గ్రాంట్ రూ. 3.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సరఫరా పనులు నిర్వహించాలన్నారు. పట్టణంలోని ఆక్రమణల తొలగింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్‌ఆర్‌టీ రోడ్డు నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, చెక్‌పోస్టు నుంచి కళామందిర్ సెంటర్, ఎన్‌ఆర్‌టీ రోడ్లలో ఆక్రమణలు తొలగించి రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఘనంగా మొహరం పండుగ



రొంపిచర్లలో పీర్ల ఊరేగింపు



చినతురకపాలెంలో పీర్ల ఊరేగింపు



కొండవీడు పీర్ల చావిడి వద్ద భారీగా ఏర్పాటు చేసిన నిప్పుల గుండం



నరసరావుపేటలో పీర్లు ఊరేగిస్తున్న దృశ్యం

గ్రామాల్లో కోలాహలంగా ఊరేగింపు

రొంపిచర్ల : మండలంలో సోమవారం మొహరం పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల, విప్పర్ల, కొత్తపల్లి, ఎడ్వర్ పేట, మునుమాక, అలవాల, అన్నవరం తదితర గ్రామాల్లో గల పీర్ల చావిడీలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆయా గ్రామాల్లో పీర్ల ఊరేగింపు కార్యక్రమం కోలాహలంగా జరిగింది. పీర్లను ఎత్తుకుని యువకులు చేసిన నృత్యాలు గ్రామస్తులను కనువిందు చేశాయి. చివరి రోజు 11వ సరగత్ సందర్భంగా అమరులైన ముస్లిం సోదరులకు సంతాప సూచకంగా పీర్ల తిరోగమన కార్యక్రమ చేపట్టారు. ముజావర్‌లు ఈ పండుగ విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రదర్శించిన విచిత్ర వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నరసరావుపేటలో...
నరసరావుపేట ఈస్ట్: త్యాగానికి ప్రతీకగా మొహరం పర్వదినాన్ని సోమవారం పట్టణంలో ముస్లీంలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ చావిడలలో గత 11 రోజులుగా పూజలందుకున్న పెద్దల పీర్లు (పంజా) సోమవారం రాత్రి ఆయా చావిడల నుంచి ఊరేగింపుగా బయలుదేరి శివునిబొమ్మ సెంటర్‌లోని అలాబా అగ్నిగుండం వద్దకు చేరుకున్నారు. అగ్నిగుండంలో నుంచి మూడు బావుల సెంటర్‌లోని కర్బలాకు బయలుదేరి వెళ్లాయి. ముస్లీం అధిక సంఖ్యలో పంజాల ఊరేగింపులో పాల్గొని ఆశీస్సులు పొందారు.

కొండవీడులో..
యడ్లపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగ పెదషరగత్ ఘనంగా నిర్వహించారు. జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన కొండవీడులో పీర్ల చావిడి వద్ద వేలాది మంది భక్తులు హాజరయ్యారు. అగ్ని గుండం చుట్టూ ప్రదిక్షణలు చేసి షర్బత్ పంపిణీ చేసి పీర్లకు భాషికాలతో అలంకరణ చేసి ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో పెద షరగత్ సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. అర్ధరాత్రి పంజాలను పట్టుకుని ముజావర్లు, వివిధ మొక్కులు చేసుకున్న భక్తులు నిప్పుల గుండం నడిచారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమాలకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పీర్ల చావిడిని సందర్శించిన ఎమ్మెల్యే..
కొండవీడు పీర్ల చావిడిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ముజావర్లును కలిసి పీర్ల వద్ద ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పండుగలు గ్రామాల మధ్య శాంతిమార్గాన్ని, స్నేహభావాల్ని వికసింపచేస్తాయన్నారు. కార్యక్రమంలో ముజావర్లు, గ్రామపెద్దలు, పార్టీ వర్గీయులు ఉన్నారు.

చినతరుకపాలెంలో...
నరసరావుపేట రూరల్: మొహర్రం వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని చినతురకపాలెంలో పీర్ల ఊరేగింపు సందడిగా సాగింది. చావిడిలోని పీర్లకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రెండు చావిడిల నుంచి పీర్లతో సాగిన ఊరేగింపులో పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. మేళతాళాలతో కోటప్పకొండ రోడ్డు బ్రిడ్జి వరకు పీర్లకు ఊరేగింపు నిర్వహించి దహనసంస్కారాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీకటింగ్ కారణంగా పట్టణంలోని ప్రాంతాలలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పోలిరెడ్డిపాలెం, లక్ష్మీనరసింహకాలనీ, మదర్ థెరిస్సాకాలనీ, బ్యాంకు కాలనీలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాదెండ్లలో...
నాదెండ్ల: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 – మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

విద్యార్థి దశ నుంచే బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి

బొల్లాపల్లి: విద్యార్థి దశ నుంచే బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని ఎంఈఓ–1 సయ్యద్ జఫ్రుల్లా తెలిపారు. స్టేట్ బ్యాంక్ బొల్లాపల్లి శాఖ కస్టమర్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీహై స్కూల్‌లో విద్యార్థులకు పొదుపు ఖాతాలు ప్రారంభ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హాజరై మాట్లాడుతూ డబ్బు ఆదా గురించి తల్లిదండ్రులు విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలన్నారు. పొదుపు ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ వి.ఆనందరావు మాట్లాడుతూ పది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి బ్యాంకు ఖాతాకు అర్హులని చెప్పారు. బ్యాంక్ ఖాతాను సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. సందేహాలు ఉంటే సమీపంలోని బ్యాంక్ శాఖ వద్దకు సంప్రదించ వచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కే.పార్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు వనజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విస్తృత తనిఖీలు



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

- 102 కేసులు నమోదు
- రూ.4.58 లక్షల అపరాధ రుసుం

రొంపిచర్ల: మండలంలోని పది గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు 102 కేసులు నమోదు చేసి రూ.4.58 లక్షలు అపరాధ రుసుం విధించారు. ఎగ్జిక్యూట్ ఇంజనీర్లు సి.హెచ్. వెంకటేశ్వరరావు, సి.హెచ్. రాంబొట్లు ఆధ్వర్యంలో 42 మంది అధికారులు, 152 మంది సిబ్బంది 42 బృందాలుగా ఏర్పడి 2847 సర్వీస్‌లను తనిఖీ చేశారు. అనుమతి లేకుండా అధిక లోడ్‌ను వాడుతున్న 94 సర్వీస్‌లను గుర్తించి రూ.3.97 లక్షలు అపరాధ రుసుం విధించారు. మీటర్లు ఉన్నా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురి నుంచి రూ.50 వేల రూపాయలను, మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురి నుంచి రూ.8 వేల రూపాయలను, మరోకరికి రూ.3 వేల రూపాయలను అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులందరూ తమ ఆధీనంలో ఉన్న మీటర్లకు సీల్ తప్పనిసరిగా ఉండేటట్లు చూడాలన్నారు.
సీల్ లేకపోయినా, తుప్పుపట్టి ఊడిపోయినా సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. అలాగే విద్యుత్ చౌర్యం సమాజిక నేరమన్నారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో పీఈఈలు కె. రవికుమార్, ఎన్. మల్లికార్జునప్రసాద్, బి. వెంకటేశ్వరరెడ్డి, ఏఈఈలు కె. రాంబాబు, ఎం. సతీష్‌కుమార్, కె. కోటేశ్వరరావు, యు. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్సు అధికారుల తనిఖీలు

నూజెండ్ల: గత ఏడాది జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో నిధుల వినియోగం పై విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విజిలెన్స్ సీఐ సైదులు బృందం రికార్డుల పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడివో ఉమాదేవి, విజిలెన్స్ సిబ్బంది శ్రీనివాసరావు ఉన్నారు.

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

ర్యాలీ నిర్వహించిన సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నరసరావుపేట: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే లేబరు కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు, పంటలకు గిట్టుబాటు, మద్దతు ధర, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, అసంఘటిత రంగాల కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఉపాధి కూలీలకు, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. మోటార్ కార్మికులకు నష్టదాయకమైన జీఓనెం.21 రద్దు చేయాలన్నారు. పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను పూర్తిగా హరించిందని మండిపడ్డారు. కార్మిక చట్టాలను కొనసాగించి లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రైవేటీకరణ విధానాలు నిలుపుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో ముందుకు సాగుతున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా కోశాధికారి డి శివకుమారి, నాయకులు సిలార్ మసూద్, షేక్ చిన్న అల్లాబక్షు, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ పిలుపు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన కరపత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం పల్నాడురోడ్డులోని ఆయిల్, దాల్, రైస్ మిల్లుల వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక సమ్మెలో కార్మిక, రైతు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సి.హెచ్.నాగేశ్వరరావు, కొవ్వూరి బాబు, సీపీఐ నాయకులు సత్యనారాయణరాజు, ఆర్.అంజిరెడ్డి, షేక్.జాన్ చినసైదా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రతమత్తంగా ఉండాలి

నాదెండ్ల: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సాయి శ్వేత చెప్పారు. చందవరం గ్రామంలో సోమవారం సీజనల్ వ్యాధులపై స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్ఞానేశ్వరి, వైద్యారోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే 12 నుంచి నిరవధిక సమ్మె

- యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్

నరసరావుపేట: వేతనాలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అన్నారు. పట్టణంలో సోమవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పురపాలక సంఘం కార్యాలయం ఎదుట ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం చుట్టూ మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పెద్దల దగ్గరకు తమ యూనియన్ నాయకులు వెళ్ళిన ప్రతిసారి సమ్మెలోకి వెళ్లొద్దని చెప్పడం తప్ప నిర్దిష్టమైన హామీలు ఇవ్వడం లేదన్నారు.
ఈనెల నాల్గున విజయ వాడలో నిర్వహించిన సమ్మె శంఖారా వంలో మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయని 11 ఏళ్ల నుంచి కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. కార్మికులు సమ్మెలోకి వెళితే ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వం, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కారణమన్నారు.
జీఓ నెం.36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలు, కారుణ్య నియామకాలు, ఇండ్ల స్థలాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని, కార్మికులపై అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పెరిగిన పట్టణీకరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు, సమ్మెకు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం కార్మికులు చిన అల్లాబక్షు, సోమశేఖర్, సామ్రాజ్యం, నాగయ్య, మాలిక్, రంగా, బి.శ్రీను, కె.శ్రీను, సింగ్ పాల్గొన్నారు.

పంటల బీమాను రైతులు ఉపయోగించుకోవాలి

పిడుగురాళ్ల: ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని ప్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ డివిజనల్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ సూచించారు. బీమా పథకానికి కంది పంటకు ఎకరానికి రూ.40, మిరప పంటకు రూ.360, వరి పంటకు రూ.80, పత్తి పంటకు రూ.1900 ప్రీమియం దగ్గరలోని పోస్టాఫీసులో గాని, గ్రామ సచివాలయంలో గాని చెల్లించాలన్నారు.